www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 జూన్ 2024 | 5 | తూర్పుగోదావరి

ఎన్నికల కోడ్ ఎత్తివేత : కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

మార్చి 16 న కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నాటి నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉన్న సార్వత్రిక ఎన్నికల కోడ్ గురువారం సాయంత్రం 5 గంటలతో ఎత్తివేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 83 రోజులుగా జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి శాంతి భద్రతలకు ఆటంకం లేకుండా సహకరించారని, రానున్న రోజుల్లోనూ అలాగే సహకారం అందించాలని ప్రజలను కోరారు. ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు లేకుండా జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఎత్తివేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఇలా జరిగిందేమిటి?

- వైసిపిలో అంతర్మథనం
- కీలక నేతలను వేధిస్తున్న పరాజయం
- పందేలతో పలువురు కుదేలు
- ఇళ్లకే పరిమితమైన నాయకులు, కార్యకర్తలు
- సంబరాల్లో కూటమి శ్రేణులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కౌంటింగ్ తేదీ ముందు రోజు వరకూ కొన్ని నియోజకవర్గాల్లో ఓటమిని ఊహించినా రాష్ట్రంలో తమ పార్టీయే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వారు దీమాతో ఉండేవారు. అయితే ఫలితాలు అందుకు పూర్తి భిన్నంగా వచ్చాయి. సంక్షేమ పథకాలు అమలు చేశాం. ప్రతి ఒక్కరికీ కావాల్సింది ఇచ్చాం. ఎన్నికల్లో ఆ కృతజ్ఞత చూపిస్తారంటూ వైసిపి శ్రేణులు ఆశించాయి. జిల్లాలో కొన్ని సీట్లయినా వైసిపి ఖాతాలో పడతాయని అంచనాలు వేసుకున్నారు. సొంత సర్వేలు నిర్వహించారు. వైసిపికి చెందిన సంస్థలు కూడా సర్వే చేసి నివేదికలు పంపాయి. జిల్లాలో నాలుగు స్థానాల్లో గెలుపొందుతామంటూ నమ్మకం పెట్టుకున్నాయి. కాని అన్ని నియోజకవర్గాల్లోనూ ఊహించని విధంగా కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. అన్ని నియెజకవర్గాల్లో అంచనాలకు మించి ఆధిక్యం సాధించారు. ప్రజాగ్రహంలో వైసీపీ అభ్యర్థులు కొట్టుకుపోయారు. ఇంత దారుణమైన ఓటమిని వైసిపికి చెందిన ఏ కార్యకర్తా ఊహించలేదు. ఇదే ఇప్పుడు వైసిపి శ్రేణులను కుంగదీస్తుంది.

ఆత్మస్తుతి... పరనింద

ఓటమి భారాన్ని తట్టుకోలేకపోతున్న నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు ఆత్మపరిశీలనలో పడ్డారు. ప్రజలకు అవసరమైన పథకాలను అందించినా ఎందుకు ఓడిపోయామా అంటూ మదన పడుతున్నారు. తాజాగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా ఆవేదన వ్యక్తం చేసిన విషయం విధితమే. తమ అధినేత చుట్టూ ఏర్పడిన కోటరీ కొంపముంచిందంటూ ఇప్పుడు ఆరోపణలు చేయడం విమర్శలకు దారి తీస్తోంది. భారీ ఓట్ల తేడాతో ఓడిపోవడం వైసిపి శ్రేణులను మరింత కుంగదీస్తోంది. ఈ ఓటమికి వైసిపి నేతల తీరే కారణమని స్పష్టమవుతోంది. నిడదవోలు నియోజక వర్గంలో మాజీ ఎంఎల్ఎ జి.శ్రీనివాసనాయుడు ఐదేళ్లపాటు నియోజకవర్గ నేతలు, కేడర్‌ను పట్టించుకోలేదు. కొవ్వూరు నియోజకవర్గంలో హోం మంత్రి తానేటి వనతికు తొలినుంచీ కేడర్‌కు దూరమైంది. గోపాలపురంలోనూ అదే పరిస్థితి. ముఖ్య నాయకులంతా పార్టీకి దూరమయ్యారు. ఈ రెండు నియోజక వర్గాల్లో అభ్యర్థులను తారు మారు చేసినా ఫలితం లేకపోయింది. రాజమహేంద్రరవంలో ఎంపి మార్గాని భరత్ తీరుతో కేడర్ క్రమ క్రమంగా దూరమయ్యారు. ఓట్ల కొనుగోలు కోసం కేటాయించిన నగదు తీసుకుని కొందరు పలాయనం చిత్తగించటం పార్టీలో ఇక్కడి పరిస్థితులను దర్పణం పట్టింది.

> **వైసిపి శ్రేణుల్లో అంతర్మథనం మొదలైంది. తాజా ఎన్నికల్లో ఘోర పరాభవానికి గురైన విషయం విధితమే. అభ్యర్థులు, ముఖ్య నేతల సంగతి ఎలా ఉన్నా కేడర్ పూర్తిగా నైరాశ్యంలో కూరుకుపోయింది. పట్టణాలు, గ్రామాల్లో కార్యకర్తలు రెండ్రోజులుగా ఇళ్లకే పరిమితమయ్యారు.**

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో సీటు ఆశించిన చందన నాగేశ్వర్‌కు వైసిపి మొండి చేయి చూపించింది. సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ స్థానికేతరుడు కావడంతో సిట్టింగ్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరికి కలిసి వచ్చింది. పార్టీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా గెలుపు ఖాయమంటూ ఆ పార్టీ వర్గాలు ఆశించినప్పటికీ ఫలితాలు పూర్తిగా తలకిందులయ్యాయి. బ్లేడ్ బ్యాచ్ సభ్యుల వీరంగం, గ్రావెల్ కొండలను దోచేసిన అక్రమార్కులు ఎంఎల్ఎ పక్కన తిరగటంతో అవినీతి మరక అంటక తప్పలేదు. ఓ బలమైన సామాజిక వర్గం బత్తుల బలరామకీష్ణకు అనుకూలంగా పనిచేయటంతో రాజాకు ఓటమి తప్పలేదు. అనపర్తి నియోజకవర్గంలో డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అనుచరుల నోటి దురుసు, అతి విశ్వాసం ఓటమికి కారణమైందని ఆ పార్టీ నేతలు చెప్పకనే చెబుతున్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సాధారణమే. ప్రతి నియోజక వర్గంలో ఐదు రౌండ్లు పూర్తయ్యే నాటికి వైసిపి అభ్యర్థులు కౌంటింగ్ సెంటర్ల నుంచి వెళ్లిపోవడం కేడర్‌ను మరింత ఆందోళనకు గురి చేసింది.

పందేలతో రూ.కోట్లు గల్లంతు

రాష్ట్రంలో మరోసారి వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందంటూ వైసిపి కార్యకర్తలు, నాయకులు భారీ మొత్తంలో పందేలు వేశారు. సామాన్య కార్యకర్తలు కూడా పందేలు వేశారు. జిల్లాలో కోట్ల రూపాయలు బెట్టింగ్‌లు జరిగాయి. వైసిపి ఓటమితో ఆ పార్టీ కార్యకర్తలు పూర్తిగా నష్టపోయారు. కొందరు రూ.కోట్లు విలువ చేసే భూములు పోగొట్టుకున్నారు. వైసిపిని నమ్ముకుని ఇప్పుడు మునిగిపోయామంటూ పార్టీ శ్రేణులు గగ్గోలు పెడుతున్నాయి. రాజమండ్రి సిటీ, అనపర్తి నియోజక వర్గాల్లో ఒకటికి ఐదు రెట్లు వస్తుందంటూ ఆశపడ్డ కార్యకర్తలు కూడా కుదేలయ్యారు. జనంలో ఉన్న వ్యతిరేకతను పసిగట్టలేక బెట్టింగ్‌లు కట్టి నష్టపోయారు.

కోడ్ పోయే... ఫ్లెక్సీలు వచ్చె...

ప్రజాశక్తి- కడియం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మార్చి 16 నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ గురువారం సాయంత్రంతో ముగిసింది. దీంతో విజయాన్ని సొంతం చేసుకున్న కూటమి నాయకులు తమ అభిమాన నేతల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. గత నెల 13న పోలింగ్ జరగ్గా ఈనెల 4న ఫలితాలు వెలువడ్డాయి. అయితే ఘన విజయం సాధించినప్పటికీ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడానికి అభిమానులకు కోడ్ అడ్డంగా మారింది. దీంతో ముందుగానే కార్యకర్తలు, అభిమానులు తమ నాయకుల ఫ్లెక్సీలను తయారు చేయించి ఉంచుకున్నారు. కోడ్ ముగియగానే ఫ్లెక్సీల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. మండల కేంద్రమైన కడియంలో భారీ ఫ్లెక్సలు వెలిశాయి. రాజమహేంద్రవరం రూరల్ నియోజవర్గంలో ఘనవిజయం సాధించిన గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

ఘనంగా పల్ల వెంకన్న జయంతి

పలువురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - కడియం

నర్సరీ రైతు కీర్తిశేషులు పల్ల వెంకన్న 88వ జయంతిని కడియపులంకలో ఆయన విగ్రహం వద్ద గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ వారు విద్యారంగానికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సంవత్సరం కడియం మండలంలో తొమ్మిది ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి, మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అలాగే మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మొత్తంగా కలిపి రూ.లక్ష నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. మండలంలో మంచి పర్సంటేజ్ సాధించిన నలుగురు ప్రధానోపాధ్యాయులను సత్కారించారు. పేదరికం చదువుకి ఆటంకంగా ఏర్పడుతుందని భావించొద్దని ,బాగా చదువుకుంటే ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తారని వాసుదేవరావు తెలిపారు. ఉప విద్యాశాఖాధికారి నారాయణ, సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, నర్సరీ సంఘం మాజీ అధ్యక్షులు పుల్లా ఆంజనేయులు, వైస్ ఎంపిపి పంతం గణపతి, ఎంఇఒలు మణికుమార్, వై.నాగేశ్వరరావు పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, సభ్యులు పల్ల సుబ్రహ్మణ్యం, గణపతి, పాఠంశెట్టి చక్రవర్తి, వెంకటేష్, వినయ్, నర్సరీ రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకన్నకు నివాళులర్పిస్తున్న డిఇఒ, నాయకులు

ప్రజల తీర్పుతో ఎపి అభివృద్ధి

ప్రజాశక్తి - తాళ్లపూడి

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో ఆంధ్ర ప్రదేశ్ అన్ని రంగాల్లోనూ మరింత అభివృద్ధి సాధిస్తుందని టిడిపి నాయకులు పారిశ్రామికవేత్త జి.వెంకటప్రసాద్ అన్నారు. పార్టీ విజయం సాధించడం పట్ల టిడిపి యువ నాయకుడు నారా లోకేష్‌ను ఆయన గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపానని ఆయన చెప్పారు. అలాగే కొవ్వూరు ఎంఎల్ఎగా ఎన్నికైన ముప్పిడి వెంకటేశ్వరరావును కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిశానిని జివి తెలిపారు. కలిసినట్లు జీవి తెలిపారు.

కూలీలతో శిరీష, కుటుంబ సభ్యులు

ఘనంగా శిరీష పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం గ్రామంలో ఉపాధి హామీ కూలీల ఫీల్డ్ అసిస్టెంట్ తలపాకుల శిరీష తన పుట్టిన రోజును గురువారం ఉపాధి కూలీల సమక్షంలో నిర్వహించుకున్నారు. వారి మధ్య కేక్ కోసి పంచారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తమ మధ్య పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు-2024ను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందికి ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదములు తెలియ జేస్తున్నానని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ ప్రారంభం మార్చి 16 నుంచి ఎన్నికల విధులు నిర్వహించిన రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, సిబ్బంది ఎంతో నిబద్ధతతో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారన్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించారన్నారు. అలాగే ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పోషించిన పాత్ర ఎన్నికలను సజావుగా సాగేందుకు ఉపయోగపడిందన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా విలువైన సూచనలు సలహాలు ఇచ్చిన ఎన్నికల అబ్జర్వర్ల, ఖర్చుల పరిశీలకులు, కౌంటింగ్ పరిశీలకులు అందించిన సూచనలు, సలహాలు పట్ల కలెక్టర్ ధన్యవాదములు తెలియజేశారు.

కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని వాటిని దష్టిలో పెట్టుకొని మరింతగా నిఘా పెట్టాలని నిర్ణయించారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ రోజున, కౌంటింగ్ సమయంలో పోలీస్, జిల్లా యంత్రాంగం ఎటువంటి లా అండ్ ఆర్డర్ సమస్యల తలెత్తకుండా చాకచక్యంగా విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారన్నారు.

నన్నయ్య యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, కేంద్ర బలగాలు, పోలీసులు, ఆర్మ్డ్ ఫోర్సెస్, భద్రత సిబ్బంది, జిల్లా స్థాయి అధికారి నుంచి దిగువ స్థాయి సిబ్బంది ఎంతో నిబద్ధతతో విధులను నిర్వహించారన్నారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించిన ఎస్పి పి.జగదీష్, ఇతర పోలీస్ అధికారులు, కేంద్ర బలగాల సేవలను కలెక్టర్ ప్రశంసించారు. ఓట్లలెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహంచడంలో సహకరించిన రాజకీయ పక్షాల ప్రతినిధులు, అభ్యర్థులు, మీడియా ప్రతినిధుల తోడ్పాటుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

దేశం మొత్తం మీద ప్రప్రదంగా రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం ఫలితాలు ప్రకటన చేయడంలో జాయింట్ కలెక్టర్, రూరల్ ఆర్ఓ ఎన్.తేజ్‌భరత్ , అదే విధంగా రాజమండ్రి పార్లమెంట్ రిజల్ట్ ప్రకటన విడుదల చేయడంలో ఆర్ఒల పనితీరును కలెక్టర్ అభినందించారు.

జెసి ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. మాధవీలత ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలు సమయానికి సూచనలు అందించడంతో ఎన్నికల ప్రక్రియను సజావుగా సాధ్యం అయ్యిందన్నారు. మూడుసార్లు ఎన్నికల ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వహించిన కలెక్టర్ అనుభవం ద్వారా జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలను పూర్తిచేశా మనడంలో సందేహం లేదన్నారు.

మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు, కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి సూచనలు మేరకు ఎన్నికలు నిర్వహణలో ఎటువంటి తప్పులు లేకుండా చేయడం జరిగిందన్నారు. టీమ్ లీడర్ గా సరైన మార్గదర్శకం వల్ల మాత్రమే ఇది సాధ్యం అయిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ జి. నరసింహులు, రిటర్నింగ్ అధికారులు ఏ. చైత్ర వర్షిణి, కే ఎల్ శివ జ్యోతి, ఆర్ వి రమణ నాయక్, ఎమ్. మాధురి, జిల్లా అధికారులు, సహయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత

మజ్జిగను పంపిణీ చేస్తున్న మానవత ప్రతినిధులు, దాతలు

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మానవత స్వచ్ఛంద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో 64వ రోజు అయిన గురువరం మజ్జిగను పంపిణీ చేశారు. చాగల్లు మెయిన్ రోడ్ శ్రీకాకతీయ కళ్యాణమండపం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో లింగాల వెంకటశాస్త్రి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసశర్మ, పద్మశ్రీ దంపతులు కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్రపుడెక్కతో మూసుకుపోయిన కాలువ

గుర్రపు డెక్క తొలగించాలి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలోని పంట కాలువలన్నీ గుర్రపు డెక్కతో మూసుకుపోయాయని, వెంటనే దాన్ని తొలగించి పంటలకు నష్టం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. వేసవిలో పూడిక తీత పనులు నిర్వహించాల్సి ఉందన్నారు. వర్షాకాలం వచ్చినా నేటికీ పూడిక తీత పనులు చేపట్టల్లేదన్నారు. ఇప్పుడైనా స్పందించి వెంటనే పనులు చేపట్టాలన్నారు. ఉపాధిలో ఈ పనులను చేర్చి పూడికను తొలగించాలని కోరారు. వంతెనల వద్ద గుర్రపు డొక్క అడ్డుపడటంతో సాగునీరు పారట్లేదని, పంటపొలాల్లో వర్షపునీరు లాగట్లేదని, ఫలితంగా పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వెంటనే పూడిక తొలగించాలని వారు కోరుతున్నారు.

కార్టూ'నిజం'

ధర్నాలో భాగంగా బైటాయించిన ఆశాలు

వేధింపులు ఆపాలంటూ ఆశాల ధర్నా

ప్రజా శక్తి - నల్లజర్ల

తమపై వేధింపులు ఆపాలని, సమస్యలను పరిష్కరించాలంటూ నల్లజర్ల మండలం పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశ వర్కర్లు గురువారం పిహెచ్‌సి కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ మాట్లాడారు. పోతవరం-11 సచివాలయం పరిధిలో ఉన్న ఎఎన్ఎం దుర్గాదేవి వేధింపులు తాళలేకపోతున్నామన్నారు. ఈ మేరకు విధులు బహిష్కరించి నిరసనకు దిగామని తెలిపారు. జిల్లా అధికారులు గతంలో విచారణ కమిటీ వేసి ఆమెకు షోకాజ్ నోటీసులు ఇచ్చి కొన్ని రోజులు సస్పెండ్ చేశారన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత ఆశ వర్కర్లకు న్యాయం చేస్తామని అధికారులు చెప్పారన్నారు. కాని నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని చోట్ల అధికారుల వేధింపులు గత ప్రభుత్వ రాజకీయ వేధింపులు తాళలేక అనేకమంది ఆశా వర్కర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. కక్షపూరితంగా ఆశాలను వేధించటం సరికాదన్నారు. ఎఎన్ఎంపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని, అంతవరకూ విధులు బహిష్కరిస్తామని తెలిపారు.

జ్యోతులకు ప్రెస్ క్లబ్ సభ్యుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గోకవరం

సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయం అందుకున్న జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూకు ది గోకవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రౌతుపండు ఆధ్వర్యంలో జగ్గంపేటలో నెహ్రూను కలిశారు. ఆయన్ని శాలువాతో సత్కరించి, పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కర్రి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు పి.దుర్గాబాబు, గౌరవాధ్యక్షులు పెనుగొండ సత్యానందం, జాయింట్ సెక్రటరీ అల్లాడి సింహాచలం, ఎ.రాజా, కోనా శ్రీనివాస్, కొంగరపు రాజు, మద్దాల బ్రదర్స్, బత్తుల టింకు, సన్నపు శాంతి బాబు, మిర్తిపాటి స్వరూప్, మాగాపు వెంకటరమణ, గుల్లంపూడి ఆనంద్, షేక్ ఘని, కాకర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూతో ప్రెస్‌క్లబ్ సభ్యులు

విజయోత్సవ ర్యాలీలో కూటమి శ్రేణులు

పలు గ్రామాల్లో కూటమి సంబరాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయ ఢంకా మోగించడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం సంబరాలు జరుపుకున్నారు. యువ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య ఆధ్వర్యంలో మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో యువగలం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర ఇతర నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. మహిళా నాయకులు కప్పల ధనలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు మహిళలు అల్లూరి ఇంటి వద్దకు వచ్చి కొవ్వూరు నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావు గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యువ నాయకున్ని అభినందించారు. మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో టిడిపి నాయకుడు కైగాల శ్రీను ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు విజయోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీను ని అభినందిస్తూ కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు.

నేరాలు ఘోరాలు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సార్వత్రిక ఎన్నికలలో తమ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయలేదని అక్కసుతో ఒక వ్యక్తి తనపై దాడి చేసి గాయపరిచాడని ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ముమ్మిడివరం పోలీసులు గురువారం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి మండలంలో చిన్న కొత్తలంక గ్రామానికి చెందిన నక్కా మావుళ్ళమ్మ ఇళ్లల్లో పని చేసుకుని జీవనం సాగిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికలలో అదే గ్రామానికి చెందిన పొత్తూరి సుబ్బరాజు ఈనెల 4న మావుళ్లమ్మ పని కోసం వెళుతుండగా మా అభ్యర్థికి ఓటు వేయమంటే వెయ్యలేదు అయినా మేమే విజయం సాధించాం అంటూ ఆమెపై భౌతిక దాడికి చేశాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఊరేగింపు ట్రాక్టర్ కిందకు నెట్టి వేశాడని, దీంతో తాను గాయపడింది. తన కుమారుడు బాలకష్ణ ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించాడని ఆమె పోలీసులకి చేసిన ఫిర్యాదులో పేర్కొంది. తనపై దాడికి పాల్పడి గాయపరిచి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె పేర్కొంది. దీనిపై ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోదావరిలో మహిళ మృతదేహం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి పాత సినిమా హాల్‌కు సమీపంలోని గోదావరి నదిలో ఒక మహిళ మృతదేహం లభ్యమైందని తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్ తెలిపారు. స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించా మన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన గంగాభవాని(52)గా గుర్తించామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

వైసిపికి వైస్ చైర్‌పర్సన్ మహాలక్ష్మి రాజీనామా

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం స్థానిక ఆసుపత్రి వీధిలోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె భర్త సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను గెలిపించిన వార్డు ప్రజలు ఇబ్బందులు పడకూడదు అనే లక్ష్యంతో వార్డు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడం లేదన్నారు. తనకు ఏ పార్టీలో చేరే ఉద్దేశం లేదన్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. త్వరలో తాను జనసేన పార్టీలో చేరుతున్నట్టు మహాలక్ష్మి కుమారుడు శ్రీకాంత్ తెలిపారు. 2014 నుంచి తాను జనసేన పార్టీలో ఉన్నానని, తన తల్లిదండ్రులు వైసిపిలో చేరడం, తన తల్లికి వైస్ చైర్మన్ పదవి ఇవ్వడంతో తాను వైసిపిలో క్రియాశీలకంగా సేవలందించానన్నారు. తన తల్లిదండ్రులు వైసిపికి రాజీనామా చేసినందున తాను జనసేన పార్టీలో చేరుతున్నట్టు ఆయన ప్రకటించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మి

వైసిపి కార్యకర్తలను చులనకగా మాట్లాడం తగదు

పిల్లి సూర్య ప్రకాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాష్ట్రంలో విజయం సాధించిన టిడిపినాయకులు వైసిపి కార్యకర్తలపై సెటైర్లు వేయడం, చులకనగా మాట్లాడటం తగదని వైసిపి అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు తీవ్ర నిరాశను కలిగించాయని, గెలుపోటములు సహజమే అయినా ప్రజలు తీర్పు ఇలా ఉంటుందని ఊహించలేదన్నారు. ఇక్కడ కార్యకర్తలను క్రమశిక్షణలో పెడతామని టిడిపి నాయకులు వ్యాఖ్యానించడం ఆయన తప్పుపట్టారు. వైసిపి కార్యకర్తలు అభిమానులు ఎవరి వద్ద క్రమశిక్షణ నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. తన తండ్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మొదటి నుండి క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, అది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వాన్ని మించింది లేదని ప్రతి నెల ఒకటో తారీకుని ఇంటి వద్దకే పింఛను, ఇంటి వద్దకే రేషన్, నాడు నేడు స్కూల్లో అభివద్ధి, ఇంగ్లీష్ మీడియం విద్య, తల్లులు ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేయటం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వంకే దక్కుతుందన్నారు. ప్రజలు సంక్షేమాన్ని విడిచిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని, గెలిచిన ఓడిన తామెప్పుడూ పేద ప్రజల పక్షాన నిలబడి వారికి ఏ ఆపద వచ్చిన ముందు ఉంటామన్నారు. వారి తరపున పోరాటాలు చేయడానికి వెనకాడమని ఆయన తెలియజేశారు. అదేవిధంగా విజయం సాధించిన టిడిపి ఎంఎల్ఎ వాసంశెట్టి సుభాష్‌కు, ఇతర టిడిపి నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నియమావళిని పాటిస్తూ సిబ్బంది అంతా సమర్థవంతంగా నిబద్ధతతో నిర్వహించారని రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు ప్రశంసించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు, సిబ్బందికి, ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ విభాగాల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు.

ఘనంగా గ్రామ దేవతల జాతర

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం గుడివాడ, దివిలి గ్రామాల్లో గురువారం గ్రామ దేవతలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గుడివాడలోని పచ్చాలమ్మ, దివిలి- పిఠాపురం రహదారిలోని జట్లమ్మ గ్రామ దేవతల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది ప్రజలు అమ్మవారులను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని పూజలు చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా జానపద కళారూపాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కనపర్తి బాబి, సుబ్రహ్మణ్యం, శ్రీను, కోన సత్తిరెడ్డి, చవ్వాకుల సత్యం, నరాల శెట్టి బాబ్జీరావు పాల్గొన్నారు.

ఘనంగా వాడ్రేవు పుట్టిన రోజు

ప్రజాశక్తి-తాళ్లరేవు

స్థానిక టిడిపి కార్యాలయంలో అమలాపురం పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వీరబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి), తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, మందాల గంగ సూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, వెంటపల్లి ఉమామహేశ్వరి, మోర్త భైరవమూర్తి, జక్కల ప్రసాద్, నిమ్మకాయల మూర్తి, టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

ఘనంగా మల్లాడి పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం, కరప

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 61వ పుట్టినరోజు వేడుకలు గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక యర్రా గార్డెన్స్‌లో మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో 61వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, హోమ్ మంత్రి నమఃశ్శివాయం, ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, స్పీకర్ సెల్వం, పలువురు ఎంఎల్ఎలు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ మరికొంతమంది నూతనంగా ఎన్నికైన ఎంఎల్ఎలు, మాజీ ఎంపీ అనురాధ, పెద్ద ఎత్తున రాజకీయ ప్రముఖులు, అభిమానులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగసామి, మంత్రులు, ఎంఎల్ఎలు మల్లాడి కృష్ణారావు సేవలను ప్రశంసించారు. ఈ వేడుకల్లో మల్లాడి కృష్ణారావు, ఆయన సతీమణి ఉదయలక్ష్మి, కుమారుడు వంశీ దంపతులు పాల్గొన్నారు. ఈ వేడుకలకు హాజరైన ప్రజలకు నూతన దుస్తులు, మల్టీ పర్పస్ పెన్నులను అందజేశారు.

కరప అభివృద్ధి, సంక్షేమాన్ని స్నేహితులుగా స్వీకరించి, ప్రస్తుత రాజకీయాలకు ఐకాన్‌గా నిలిచిన వ్యక్తి మల్లాడి కృష్ణారావు అని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. గురువారం యానాంలో జరిగిన పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 61వ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత బేధం లేకుండా అందరినీ ఒకే విధంగా చూస్తూ యానాం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. తన విజయానికి ఆయన స్నేహ హస్తం అందించారని తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఉన్న తమ స్నేహబంధం ఇలాగే కొనసాగాలని, ఇలాంటి పుట్టినరోజులు ఆయన మరెన్నో జరుపుకోవాలని కోరారు. అనంతరం పుదుచ్చేరి సిఎం ఎన్.రంగస్వామిని కలవగా ఆయన నానాజీకి శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టరేట్ గ్రహీత సుబ్బారావు అభినందనలు

ప్రజాశక్తి-కొత్తపేట

డాక్టరేట్, భారత కళారత్న అవార్డుల గ్రహీత వులుసు వీర వెంకట సత్య సుబ్బారావుకు శాసనమండలి డిప్యూటీ మాజీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు. గత నెల 25న అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్, భారత కళారత్న అవార్డులును చెన్నైలో సుబ్బారావు అందుకున్న సంగతి తెలిసిందే. ఆ మేరకు సుబ్బారావును గురువారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ మాజీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుబ్బారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. సుబ్బారావు తమ కళాశాలలో 15 సంవత్సరాలుగా ఉత్తమ సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు.

బంగారు పతకాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అపోవా బ్యాంక్ మెన్ చాప్టర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్, నీట్, జెఇఇ పరీక్షలు రాసి మొదటి వెయ్యి ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థుల్లో వంద మందిని స్వర్ణ పతకాలతో సత్కరించనునట్లు ఆ సంస్థ ప్రతినిధి కె.రామానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తులను HTTPS/formsGLE/4draj T2L7qR8v5NJB వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 20 లోపు దరఖాస్తులను సంస్థ అధ్యక్షుడు పివి.రమణయ్య, ప్లాట్ నెంబరు 3-81/202, విజేత విహార్ అపార్ట్‌మెంట్, చైతన్యపురి, హైదరాబాద్-500060కు పంపాలని అన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 9441928528, 9290529133లో సంప్రదించాలన్నారు. ఈ నెల 30న ఉదయం 9 గంటలకు హైదరాబాద్ లకిడాకాపూల్ వద్ద గల వాసవి సేవా కేంద్రంలో విద్యార్థులను సత్కరించనున్నట్లు రామానందం తెలిపారు.

పాదరక్షలు పంపిణీ చేస్తున్న దాతలు

పర్యావరణ పరిరక్షణకు కార్యాచరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పర్యావరణ పరిరక్షణకు కార్యాచరణను విడుదల చేశామని, అన్ని పాఠశాలల్లో దీన్ని నిర్వహించాలి జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. జూన్ 5న నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమనికి కొనసాగింపుగ పాఠశాలలు తెరిచిన తర్వాత జూన్ 12 నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలలో 'ఎకోక్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్' పేర కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ మేరకు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచలకులు ఆదేశాలు జారీ చేశారన్నారు. 'ఒక్క ప్లాస్టిక్ వినియోగం కూడా వద్దు' అనే నినాదంతో ర్యాలీలు నిర్వహించాలన్నారు. పోస్టర్స్ ఏర్పాటు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జ్యూట్ బాగ్స్ వినియోగం, సహజ సిద్ధమైన వస్తు వినియోగం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 12న 'జల పొదుపు' పేర నీటి వృథాపై అవగాహన, 13న 'శక్తి పొదుపు' పేర స్లొగన్స్ ప్రదర్శన. 14న 'చెత్త తగ్గించుట', 15న 'ఎలక్ట్రానిక్ చెత్త తగ్గించుట', 18న 'స్థిరమైన ఆహార వ్యవస్థలను అనుసరించుట', 19న "ఆరోగ్య శైలి అనుసరించుట'పై సెమినార్లు, డెబిట్లు,ర్యాలీలు నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎంఎల్ఎ సుభాష్

ప్రజాశక్తి-కాజులూరు

రామచంద్రపురం ఎంఎల్ఎగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్ గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిలో దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున ఎంఎల్ఎగా ఎన్నికైన సుభాష్ అధినేత చంద్రబాబును కలుసుకునే ముందు దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వెళ్లారు. ఎంఎల్ఎ వెంట తెలుగుదేశం నాయకులు గుబ్బల యేసు రాజు, తోట కృష్ణ, గండి కిషోర్, వడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంఎల్ఎ సుభాష్

మహారాజశ్రీ 8వ అదనపు డిస్ట్రిక్టు జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

A.S. 61/2023

Between:
Birada Naga Durga Bhavani Satyanarayana Singh @ Naga Singh
...Appellant/ 10th Defendant
AND
Nakka Nagamani and Others
...Respondents/ Plaintiff & Defendants 1 to 9 & 11

R-7: Beri Sashikala, W/o. late Surendra Babu, D.No. 64-35-254, Ramadasupeta, Rajamahendravaram.
R-8: Beri Meghana, D/o. late Surendra Babu, D.No. 64-35-254, Ramadasupeta, Rajamahendravaram.
R-9: Beri Siddhu, D/o. late Surendra Babu, D.No. 64-35-254, Ramadasupeta, Rajamahendravaram.

పై నెంబరు అప్పీలులో రెస్పాండెంట్స్ 7, 8, 9 లకు సమన్లు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సదరు 7, 8, 9 రెస్పాండెంట్స్‌కు నోటీసు నిమిత్తం **ది. 19-06-2024వ సంగరం తేదీన వాయిదా అయివున్నది. అందువలన సదరు వాయిదా తేదీ ఉదయం 10.30 నిగలకు** మీరు స్వయముగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై అప్పీలులో మీకు ఆక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేని యెడల సదరు అప్పీలులో మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

B.V.S.T.RAAMA RAO, Advocate
రాజమహేంద్రవరం Rajahmundry
ది.5-6-2024 Cell: 9849270072

'ఎగ్జిట్ పోల్స్'ను బురిడీ కొట్టించిన ఓటర్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రతి ఎన్నికలలో ఓటర్లు నాడిని తెలుసుకునేందుకు పలు సర్వే సంస్థలు, పలు టివి ఛానళ్లు పోటీపడి మరి ఎగ్జిట్ పోల్స్ ను రూపొందించటం పరిపాటిగా జరుగుతోంది. అయితే ఈసారి ఓటర్లు ట్రెండ్ మార్చారు. తాము ఏ పార్టీకి ఓటు వేసింది తెలియనీకుండా జాగ్రత్తపడ్డారు. దీంతో ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అటు సర్వే సంస్థలకు ఇటు టివిఛానల్స్‌కు ఓటర్ల నాడి అంతు పట్టలేదు. ఎన్నికలు పూర్తయిన వెంటనే సర్వే సంస్థలు టివి ఛానల్స్ రహస్యంగా ఓటర్ల అభిప్రాయాలను సేకరించేందుకు వారు రహస్యంగా వేసిన ఓటు వివరాలు తెలుసుకునేందుకు కొన్ని శాంపిల్లను సేకరిస్తారు. ఇలా సేకరించిన శాంపిల్ స్ అన్ని క్రో డీకరించి వాటిలో ఏ ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు వేసే నిర్ధారించి దాని తర్వాత ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి అనేది వెల్లడిస్తారు. గతంలో అనేకసార్లు ఎగ్జిట్ పోల్స్ చాలావరకు నిజం కాగా ఇటీవల వస్తున్న ఎగ్జిట్ పోల్స్‌కు ఫలితాలకు పొంతన ఉండకపోవడంతో ఓటర్లు తాము ఏ పార్టీకి ఓటు వేసింది తెలియకుండా రహస్యంగా వ్యవహరిస్తున్నారనేది తేటతెల్లమైంది. 2024 ఎన్నికల్లో పలు సర్వే సంస్థలు పలు ఛానల్లో నిర్వహించిన సర్వేల్లో అధికార వైసిపి పార్టీ 110 నుంచి 140 సీట్లు వచ్చే అవకాశం ఉందని అందుకే శాతం సర్వేలు వెల్లడించగా, కొన్ని సర్వే సంస్థలు ఎన్‌డిఎకు 90 నుంచి 100 వరకు సీట్లు గెలవచ్చని, వైసిపికి 70 నుండి 80 సీట్లు రావచ్చని అంచనాలు వేశారు. ఎగ్జిట్ పోల్స్ సంచినాలకు తలకిందులు చేస్తూ మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాలు రాష్ట్ర చరిత్రలోనే విస్మయాన్ని కలిగించే విధంగా వెలుపడ్డాయి. అధికార వైసిపికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా కోల్పోవడం ఆ పార్టీకి నాయకులకు కార్యకర్తలకు ఇంకా మింగుడు పడటం లేదు. కనీసం 18 సీట్లు ఉన్న పార్టీని ప్రతిపక్ష పార్టీగా గుర్తిస్తామని ఎన్నికల కమిషన్ నిబంధనలు చెబుతున్నాయి. మొదట్లో కనీసం 20 నుంచి 30 సీట్లు గెలుస్తారనుకున్న వైసిపి కేవలం 11 సీట్లకు పరిమితం కావడంతో ఆ పార్టీ నాయకుడు ప్రతిపక్ష హోదా కూడా కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నారు. మరోవైపు ఎవరు ఊహించని విధంగా సర్వేలన్నిటిని తలకిందులు చేస్తూ ఎన్‌డిఎ కూటమికి 164 సీట్లు రావడం ఎవరూ ఊహించని పరిణామంగా మారింది. దీంతో టిడిపి, జనసేన, బిజెపిలో ఎనలేని హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఓటు వేసిన ఓటర్లు చాలా రహస్యంగా ఈసారి సర్వే సంస్థలకు టివి ఛానల్స్‌కు చెప్పకుండా వ్యవహరించి కొత్త ట్రెండుకు శ్రీకారం చుట్టారు. ఇక నుంచి సర్వే సంస్థలు ఓటర్లు చెప్పే దాంట్లో ఎంత నిజం ఉంది అనేది నిర్ధారించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్లో అంతగా ప్రభావం లేని బిజెపి, టిడిపితో పొత్తు పెట్టుకోవడంతో ఆ పార్టీకి అటు ఎంపి స్థానాలు వీటి ఎంఎల్ఎ స్థానాలు కూడా సునాయాసంగా దక్కించుకోగలిగింది. వెలువడిన ఫలితాలను చూసి సర్వే సంస్థలు టివి ఛానల్స్‌కు అవాక్కవ్వడం వాటి వంతు అయింది. ఇకనుండి ఎన్నికల్లో జరిగే సర్వేలు ఎగ్జిట్ పోల్స్ ఎంతవరకు నమ్మవచ్చు అనేది ఈ ఎన్నికల నుంచే ఆయా పార్టీల్లోనూ నాయకుల్లోను అభిమానుల్లోనూ సందేహం కలగడానికి ప్రస్తుత పరిణామాలు ఒక ఉదాహరణ గా మారనున్నాయి. ఓటర్లు నాడిని పట్టుకోవడం అంత సులువు కాదని ఈ ఎన్నికలు నిరూపించడంతో, సర్వే సంస్థల పైన సామాన్యులకు నమ్మకం సడలే ప్రమాదం పొంచి ఉందనడంలో సందేహం లేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

విద్యుత్ లైన్ మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి 8:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. మురళీకొండ, సాయిబాబా గుడి, సోమనవారి తోట, లెప్రసీ కాలనీ, కొత్తపేట, పాత బొమ్మూరు, ఎఎంజి బ్యాక్ సైడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాపారావుకు సన్మానం

ప్రజాశక్తి-ఆలమూరు

కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు విజయంలో కీలక పాత్ర వహించి భారీ మెజార్టీకి కారుకులైన పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావును స్థానిక మండల ఉపాధ్యాయుల సంఘం (ఎస్‌టియు) ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఆయన నివాసంలో పాపారావును మండల ఎస్‌టియు నాయకులు కలిశారు

వృద్ధులకు పాదరక్షల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి సౌజన్యంతో గురువారం వృద్ధులకు పాదరక్షలు, విసనకర్రలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవగా భావించి కొన్నేళ్లుగా వృద్ధులకు పాదరక్షలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మనం చేసే ప్రతి పనిలో దైవ సంతోషమే ప్రేరణగా ఉండాలని వరలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, సూర్య, అంగన్‌వాడీ కార్యకర్త పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో గురువారం విద్యార్థులకు 'సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులకు కలిగే ఉపయోగాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో సింగం బుల్లయ్య, టి.కాటమరాజు, జి.రాజేష్, పి.అరవింద్, రామారావు పాల్గొన్నారు.

7 నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక రామారావు పేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఈ నెల 8, 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎపి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఛైర్మన్ సిహెచ్.విజయ్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ వి.భాస్కరరామ్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో మెన్, ఉమెన్, బాలురు విభాగాల్లో అండర్ 19, అండర్ 17, అండర్ 15, అండర్ 13, అండర్ 11, డబుల్స్, మిక్స్డ్ డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు.

నెలాఖరుకు శివలింగం మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో శివలింగం మరమ్మత్తు పనులు ఈనెలఖారకు పూర్తవుతాయని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు తెలిపారు. ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ గల స్వామివారి శివలింగం శిథిలావస్థకు చేరుకోవడంతో శివలింగ జీర్ణొద్ధరణ పనులను పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ఇక్కడ గల మాణిక్యమ్మ అమ్మవారి ఆలయం, స్వామివారి శివలింగం మరమ్మతులు చేపట్టారు. అమ్మవారి ఆలయంలో మరమ్మతు పనులు పూర్తయ్యాయి. కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్ట్ వి.కోటయ్య, అసిస్టెంట్ ఆర్కియాలజీ కెమిస్ట్ ఎస్‌వి.నాగేంద్ర, ఔరంగాబాద్ నుంచి వచ్చిన సీనియర్ మోడలర్ సుధీర్ వాగ, ఆలయ ఇఒ పి. తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామి వారి శివలింగం పరిశీలిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ అధికారులు

చంద్రబాబును కలిసిన ఎంఎల్ఎ దివ్య

ప్రజాశక్తి-కోటనందూరు

తుని ఎంఎల్ఎ యనమల దివ్య గురువారం టిడిపి అధినేత చంద్రబాబును పార్టీ కార్యాలయంలో కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలవడం తనకు ఆనందంగా ఉందని క్యాబినెట్లో స్థానం కల్పించాలని చంద్రబాబును ఆమె కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్టు తెలుగుదేశం పార్టీ శ్రేణులు తెలిపాయి.

చంద్రబాబును పుష్పగుచ్ఛం అందజేస్తున్న దివ్య

అందుబాటులో వరి విత్తనాలు

ప్రజాశక్తి -కరప

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ నుంచి ఖరీఫ్ 2024 పంట కాలానికి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి ఎఒ రాజేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరితో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో స్వర్ణ వరి విత్తనాలు 269 స్వర్ణ రకం బస్తాలు, 114 బస్తాలు ఎంటియు 1318 రకం రైతు భరోసా కేంద్రాల్లో లభ్యమవుతున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలకు సంబంధించి మొలక శాతం నిర్వహించి దానికి సంబంధించిన ఫోటోను రైతు గ్రూప్‌లో పెట్టినట్టు తెలిపారు. రైతులందరూ రైతు భరోసా కేంద్రానికి వచ్చి విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

చంద్రవరం గ్రంథాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

చంద్రవరం శాఖా గ్రంథాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు గురువారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి, లైబ్రరీ సెస్ సక్రమంగా చెల్లించేలా కృషి చేయలని గ్రంథాలయ సిబ్బందికి సూచించారు. లైబ్రరీలో జరిగే సమ్మర్ క్యాంప్ విద్యార్థులతో ముచ్చటించారు. స్టోరీ టెల్లింగ్, శతక పద్యాలు చెప్పిన చిన్నారి ఆర్.భవ్య, ఎం.సత్యశ్రీని అభినందించారు. గ్రంథాలయానికి ప్రతి రోజూ రావాలని, ప్రతి ఆదివారం జరిగే 'చదవడం అంటే మాకిష్టం' కార్యక్రమంలో పాల్గొనాలని విద్యార్థులకు సూచింరు ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.సుమన్‌కుమార్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు

రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినవి

యానాం, కనకాలపేటకు చెందిన తోట దుర్గ శ్రీవల్లి, D/o. తోట నాగరాజు నా కుమార్తెకు చెందిన 10వ తరగతి మార్క్స్ లిస్ట్, టిసి మరియు ఇంటర్మీడియట్ సర్టిఫికెట్స్ పోయినవి.

10వ తరగతి TC No. 0816, పదవ తరగతి మార్క్స్ లిస్ట్ (SS) - 068158, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ నెం. U111725 ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను జిరాక్స్ నిమిత్తం 28-05-2024వ తేదీన తీసుకొని వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్ నందు తెలుపగలరు.

అడ్రస్: **తోట దుర్గ శ్రీవల్లి**
D/o. టి.నాగరాజు, డోర్ నెం. 10-4-025, పోలేరమ్మ వీధి, కనకాలపేట, యానాం, పుదుచ్చేరి-533464, సెల్: 79956 25984

పాస్‌పోర్టు పోయినది

తూ॥గో॥జిల్లా, కొవ్వూరు మండలం, దొమ్మేరు గ్రామ కాపురస్తురాలు శ్రీమతి నీరుకొండ హారిక, భర్త: శివ అను నాకు 'Doha" దేశంలో గల ఇండియన్ అంబాసిడర్ కార్యాలయం వారు ది. 22-12-2015వ తేదీన నం. **XO 578711** తో ఎమర్జెన్సీ పాస్‌పోర్ట్ సర్టిఫికెట్ ఇచ్చినారు. ది. 20-5-2024వ తేదీన సదరు ఒరిజినల్ ఎమర్జెన్సీ పాస్‌పోర్ట్ సర్టిఫికెట్‌ను తీసుకొని జిరాక్స్ నిమిత్తం నా యింటి వద్ద నుండి మార్కెట్‌కు వెళ్లుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఇది దొరికినవారు క్రింద తెలియపరచిన అడ్రస్‌కు సమాచారం అందించవలసిందిగా కోరుచున్నాను.

శ్రీమతి నీరుకొండ హారిక
భర్త: శివ, డో.నెం. 9-238
గణేష్ కాలనీ, దొమ్మేరు, కొవ్వూరు మండలం
సెల్: 9014843238

వేలం ప్రకటన

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో,
E.P. 16/2023
O.S. 279/2014

Between:
P.S.M.Srikanth ... D.Hr
and
Cherukuri S.V.S.Padmaraju ... J.Dr

పై నంబరులో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టులో ది. 21-06-2024 సంగ తేదీన పై కోర్టులో ఉదయం 10.30 గంగ లగాయతు వేలం వేయుదురు. కావున సదరు ఆస్తి గురించి వివరములు కావలసినవారు జిల్లా కోర్టు సెంట్రల్ నజారత్ ఆఫీసునందు గాని, ఈ క్రింది D.Hr తరపు Advocate గారి ఆఫీసు నందు గాని తెలుసుకోవలెను.

Schedule

తూర్పుగోదావరి జిల్లా, పిడింగొయ్యి సబు రిజిస్ట్రారులో చేరిన రాజమండ్రి రూరల్ మండలం, కాతేరు గ్రామ పంచాయతీ Areaలో గల కాతేరు గ్రామం తాలూకు దుర్గానగర్ 2వ వీధి జిరాయతీ మెరక R.S.No.100 మరియు 101ర్లు పూరా య.4.45ట్లు భూమిన్నీ, ఇండ్ల ప్లాట్లుగా విభజించి, లేఅవుట్ చేయించిన Plot No.5రు చ॥గ॥ 315 లో పడమర దిశ భాగం చ॥గ॥ 126లుకు, చ॥మీ॥ 105.34ర్లు స్థలములో జి+1గా నిర్మించినట్టి Assessment No.3288 రుకు ప్రస్తుత Door No.8-103రు గల Ground మరియు 1st Floor తో ఉన్నటువంటి RCC Roof గల మేడ ఇల్లు, స్థలము వగైరాలకు హద్దులు, కొలతల వివరము.

తూర్పు: ఈ ఆస్తి తాలూకు గోడను చేరి ఈ నంబరు Plotలో మిగతా M.వేంకటేశ్వరరావు గారి తాలూకు ఆస్తి అ॥ 63.0లు.
దక్షిణం: లేఅవుట్ Plan దాఖలా Road అ॥ 18.0 లు.
పడమర: ఈ ఆస్తి తాలూకు గోడను చేరి లేఅవుట్ Plan దాఖలా Plot No.4 రు దాఖలా ఇంటి స్థలం అ. 63.0లు.
ఉత్తరం: ఈ ఆస్తిని చేరి ఆనెం మల్లయ్య గారి స్థలం అ॥ 18.00 లు.

ఈ హద్దుల మధ్య చ॥గ॥ 126లుకు, చ॥మీ॥ 105.34 స్థలము, అందలి జి+1గా నిర్మించినట్టి D.No. 8-103రు గల Ground మరియు 1st Floorతో ఉన్నటువంటి RCC Roof గల మేడ ఇల్లు, స్థలం వగైరాలు, ఇందలి తలుపులు, ద్వారబంధములు, కిటికీలు సమస్త Electrical Service మరియు Fittingలు, నీటి వనరులు, సమస్త ఈజిమెంటు హక్కులతో సహా వేలం వేయుదురు.

D.Hr Value	:	Rs.15,00,000/-
Amin Value	:	Rs.35,00,000/-
SR Value	:	Rs.25,67,668/-
J.Dr Value	:	Not Given

CH.V.PRASAD, Advocate for D.Hr
6-9-9, Kalabargivari Street,
Rajahmundry T.Nagar
Dt: 06-06-24 Rajahmundry-533101